క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ధాన్యాధివాసం



ప్రత్తిపాడు: అంకమ్మతల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం నిత్యపూజ, క్షీరాధివాసం, వాస్తు పూజ, పంచామృతాదివాసం, సుగంధ ద్రవ్య స్నపనం, సముద్రోధక అభిషేకం, ఆదివాసం హోమం, మధ్యాహ్నం నవగ్రహ ఆరాధన, సాయంత్రం ప్రధాన కలశవాహన సాలీర్చన, రాత్రి క్షీరతర్పణం, న్యాసకళ, అంగ, ప్రత్యంగ, అధివాస, ధాన్య, పుష్ప వస్త్రాధివాసములను అత్యంత వేడుకగా నిర్వహించారు. దాన్యాధి వాసానికి గ్రామస్తులు తమ ఇంటి నుంచి ధాన్యాన్ని సమర్పించారు. అనంతరం దర్బార్ సేవ, వేద పారాయణం జరిగాయి. ప్రత్యేక యజ్ఞయాగాదులు, హోమాలను చేశారు.

కొమ్మమూరు కాల్వకు జలకళ
తాగునీటి అవసరాలకు చెరువులకు నీరు



చేబ్రోలు: ప్రస్తుత వేసవిలో ప్రజల తాగునీటి అవసరాల కోసం కొమ్మమూరు చానల్‌కు నీరు విడుదల చేయటంతో గురువారం చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని చెరువులకు నీరును ఇంజన్ల ద్వారా మళ్లించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తగినంత వర్షపాతం లేకపోవటంతో ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయి. వేసవిలో ఎండ తీవ్రత పెరగడంతో తాగునీటి చెరువుల్లోని నీటి మట్టాలు తగ్గిపోయాయి. ప్రకాశం బ్యారేజ్ నుంచి తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయటంతో కాలువల ద్వారా వచ్చే నీటితో చెరువుల్లో నీటిమట్టంను పెంచటంతో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. మేజర్ గ్రామ పంచాయతీ చేబ్రోలు, గొడవర్రు, నారాకోడూరు, వేజెండ్ల గ్రామాల్లోని మంచి నీటి చెరువులు ద్వారా ప్రజలకు తాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ గ్రామాల పరిధిలో గ్రామ సచివాలయ సిబ్బంది కాలువల్లోని నీటిని చెరువులకు ఇంజన్ల ద్వారా తరలించే ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

క్రీస్తు మార్గం పవిత్రం
కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్



గుంటూరు రూరల్: క్రీస్తుని మార్గం ఎంతో పవిత్రమని, ఆయన మార్గంలో నడిచిన వారికి పరలోక రాజ్యం కలుగుతుందని కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్ తెలిపారు. గురువారం నల్లపాడులోని మినిస్ట్రీస్ సమీపంలో సువార్త ఉజ్జీవ మహాసభలను ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీస్తుని శృతి గీతాలతో క్రీస్తు నామాన్ని ఘనపరిచారు. కార్యక్రమంలో భాగంగా 16వ నూతన గీతాల పాటల ఆల్బమ్ సీడీలు, పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రదర్ హోసన్నా, పాస్టర్ డేవిడ్ రాజు, కృపా మినిస్ట్రీస్ సంఘాలు, సేవకులు దేశ నలుమూలల నుంచి క్రీస్తుని భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ బీసీ నవచైతన్య సేవా సంఘం అధ్యక్షులు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరాధ్యుల శివయాదవ్, కరేటి రవి, వెంకటేశ్వరరావు, దానబోయిన వెంకటనరసయ్య, భీష్మ పాములు, పి.యలమంద, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

వెల్లివిరిసిన రంజాన్ శోభ

- ముస్లిం సోదరులలో ఉప్పొంగిన భక్తిభావం
- మసీదుల్లో సామూహిక ప్రార్థనలు

ప్రత్తిపాడు: నెలవంక కనిపించడంతో ఉత్సాహం ఉప్పొంగింది. రంజాన్ సంబరాలు అంబరాన్నంటాయి. నెలరోజులపాటు చేసిన కఠోర ఉపవాస దీక్ష బుధవారం నెలవంక దర్శనంతో ముగిసింది. ముస్లిం సోదరులంతా సంతోషంతో సందడి చేశారు. ఆనందంతో ఒకరినొకరు ఆప్యాయంగా హత్తుకున్నారు. ప్రత్తిపాడుతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ శోభ వెల్లివిరిసింది. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్తిపాడు గ్రామంలోని మసీదులు కళకళలాడాయి. వందలాది మంది ముస్లిం సోదరులు మక్కా మసీదు ప్రాంగణంలో అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన విందు కార్యక్రమాలకు హిందువులను సైతం ఆహ్వానించి, మత సామరస్యాన్ని చాటుకున్నారు. పవిత్రమైన మనస్సుతో దీక్షలు, ప్రార్థనలు నిర్వహించారు. ఇస్లాం అమన్ శాంతిని కోరుకుంటుందని రంజాన్ మాసమంతా నియమనిబద్ధ జీవితాన్ని గడిపిన మనం ఇక ముందు కూడా అలాగే ఉందామని ముస్లిం మత పెద్దలు బోధించారు. ఖురాన్ నమాజ్ పఠనంతో పవిత్రత చోటుచేసుకుంటుందని వివరించారు. మహమ్మద్ ప్రవక్త చెప్పిన ప్రబోధాలను గుర్తుకుతెచ్చుకోవడం, జకాత్‌ఫిత్రా పేరుతో దానధర్మాల విశిష్టతను చెప్పడం రంజాన్ ప్రత్యేకత అని ఉత్బోధించారు. చిన్నారులు సైతం తమ తండ్రితో కలిసి నమాజ్ చేసేందుకు వచ్చారు. వేకువజామునే తలస్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి పవిత్రంగా అల్లాను పూజించారు.

బంధువులతో కళకళ..

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎక్కడెక్కడో సుదూర ప్రాంతాలలో, దేశవిదేశాలలో స్థిరపడిన బంధువులు, రక్తసంబంధీలకులు స్వగ్రామాలకు రావడంతో ఇల్లలో సందడి వాతావరణం నెలకొంది. చిన్నా పెద్ద అంతా కలిసి పండుగను ఉల్లాసంగా, ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని మసీదుల్లో ఉదయం నుంచే ప్రార్థనలు జరిగాయి.



రంజాన్ విశిష్టతను వివరిస్తున్న మత పెద్దలు

గ్రామాల్లో రంజాన్ వేడుకలు

కాకుమాను: మండలంలోని గ్రామాల్లో ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కొమ్మూరు ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు అల్లాహ్ చూపిన మార్గంలో నడవాలని మత పెద్దలు సూచించారు. కాకుమానులో రంజాన్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇమామ్ హిదయతుల్లా రంజాన్ పండుగ విశిష్టత గురించి వివరించారు. మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

శాంతియుత జీవనంలో ఆనందం

పొన్నూరు: రంజాన్ పండగను గురువారం ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డులోని ఈద్గాతో పాటు, పలు మసీదులకు వెళ్లి ప్రత్యేక నమాజ్ చేశారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. శాంతియుత జీవనంలోనే ఆనందం ఉంటుందని, ప్రతిఒక్కరూ దానగుణం అలవర్చుకోవాలని తెలిపారు. పట్టణంలోని ఈద్గాలో వైఎస్ఆర్ సీపీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. నమాజ్‌లో రాష్ట్ర మైనారిటీ కమీషన్ సభ్యులు షేక్.సైపుల్లా, అంజుమన్ అధ్యక్షులు మామ, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్ సీపీ పట్టణ అధ్యక్షులు ఎంఏ. మహమూద్, నాయకులు షేక్. నాజర్, షేక్. సుభాని పాల్గొన్నారు.



ప్రత్తిపాడులోని మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు



కొమ్మూరు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు



నమాజులో అంబటి మురళీకృష్ణ

భక్తిశ్రద్ధలతో..

పెదకాకాని: రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొత్త బట్టలు, టోపీలను ధరించడంతో పాటు కళ్లకు సుర్మాతో మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. మత పెద్దలు రంజాన్ పండుగ ప్రాధాన్యం, సారాంశాన్ని వివరించారు. ఖురాన్ పఠనం, నమాజ్ ముగిసిన అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

చేబ్రోలు: మండలంలో రంజాన్ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. చేబ్రోలు, గొడవర్రు, వేజండ్ల, నారాకోడూరు, సుద్దపల్లి, వడ్లమూడి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



పెదకాకానిలో రంజాన్ ప్రార్థనలు..



చేబ్రోలు ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజు

పన్ను చెల్లింపునకు 'హెల్ప్ డెస్క్'



నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024–25) సంబంధించిన ఆస్తి పన్నును ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరు లోపు చెల్లించే వారికి మొత్తం పన్ను పై కల్పించిన 5 శాతం రాయితీకి నగర ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని, పన్ను చెల్లింపుదార్లకు వీలుగా సెలవు రోజుల్లోను క్యాష్ కౌంటర్లు పని చేసేలా తగిన ఏర్పాట్లు చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలో అదనపు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు భారత్ పేటలోని 140, పెద్ద పలకలూరు రోడ్ లోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్ లోని 148 వార్డ్ సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా cdma.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పన్ను చెల్లించవచ్చని తెలిపారు.

14న బీసీ సంఘ రాష్ట్రస్థాయి ప్లీనరీ

నెహ్రూనగర్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న భవిష్యత్ కార్యాచరణపై రాష్ట్రస్థాయి ప్లీనరీ సమావేశాన్ని గుంటూరులోని ఏటుకూరు రోడ్డులో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయంగా ప్రయాణం ఎటువైపు అనే స్వల్పకాలిక లక్ష్యం పైన, దీర్ఘకాలిక లక్ష్యంగా 2029 ఆపై ఎన్నికలలో రాజకీయంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలనే దానిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్లీనరీ సమావేశానికి బీసీలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతి కుమార్, కన్నా మాస్టర్, అశోక్ పాల్గొన్నారు.

మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలి

వైఎస్ఆర్ సీపీ పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచులు, నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం 3.30గంటలకు ఏటుకూరు బైపాస్‌లో జరిగే మేమంతా సిద్ధం బహిరంగ సభలో నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్లపూడి రమేష్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు షేక్.నాజర్, వట్టిప్రోలు రంగారావు, బొద్దులూరి రంగారావు, వడ్రాణం ప్రసాదు, అమిరినేని సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, బోయి నాగరాజు, దాసరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం

ప్రత్తిపాడు: అంకమ్మ తల్లి ఆలయంలో షెడ్డు నిర్మాణానికి దాత అదనంగా మరో రూ. 2.50 లక్షల విరాళాన్ని అందించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నూతనంగా పునర్నిర్మిస్తున్న అంకమ్మ గుడి ఆవరణలో భక్తుల సౌకర్యార్థం 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో షెడ్డును నిర్మిస్తున్నారు. షెడ్డు నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా చేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రత్తిపాడు వాసి బాపతు మదన గోపాల్‌రెడ్డి, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయినిగా చేస్తున్న రుద్రమదేవి దంపతులు గత నెల రూ.5 లక్షలు విరాళమిచ్చారు. గురువారం మరో రూ. 2.50 లక్షల నగదు చెక్కును ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు బాపతు సాంబశివారెడ్డికి అందజేశారు. తన తల్లిదండ్రులు బాపతు చెన్నారెడ్డి, నాగరత్నమ్మల జ్ఞాపకార్థం షెడ్డు నిర్మాణం నిమిత్తం రూ.7.50లక్షలను ఆలయానికి విరాళమిచ్చినట్లు మదనగోపాల్‌రెడ్డి తెలిపారు. గంగిరెడ్డి నాగమల్లేశ్వరి, మురళీధర్‌రెడ్డి, రజిని, నాగరాజు, బాపతు శ్రీనివాసరెడ్డి, గుండ్లకుంట రామాంజనేయ రెడ్డి, చిన్నపురెడ్డి చిన అంజిరెడ్డి, వెంకటరత్నం, కమిటీ సభ్యులు ఉన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు నగదు చెక్కు అందజేస్తున్న మదనగోపాల్ రెడ్డి దంపతులు

పార్కిన్సన్స్‌పై అవగాహన అవసరం

సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ

గుంటూరు మెడికల్: భారత దేశంలో చాలావేగంగా పార్కిన్సన్స్ వ్యాధి పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు వ్యాధిపై అవగాహన కల్గి ఉండాలని సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పటల్ న్యూరో సైన్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ పార్కిన్సన్స్ డీసీజ్ అవేర్‌నెస్ డే ను పురస్కరించుకుని గురువారం స్థానిక కొత్తపేటలోని లలితా హాస్పటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో డాక్టర్ విజయ మాట్లాడుతూ నరాల సంబంధిత రుగ్మతల్లో పార్కిన్సన్ వ్యాధి వల్ల చాలా తీవ్రమైన ఇబ్బందులు రోగులు ఎదుర్కొంటారని తెలిపారు. ఈ వ్యాధికి నేడు అత్యాధునిక డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్) అనే అత్యాధునిక ఆపరేషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. త్వరలోనే తమ ఆస్పత్రిలో ఈ ఆపరేషన్లు ప్రారంభిస్తామని న్యూరోసర్జన్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. తొలుత పార్కిన్సన్స్ బాధితుల కోసం డాక్టర్ విజయ ప్రత్యేకంగా ఓపీని ప్రారంభించారు. డాక్టర్ బి.ఉషాకిరణ్, డాక్టర్ వై.రామచంద్ర, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పాల్గొని రోగులు, వారి సహాయకుల సందేహాలను నివృత్తి చేశారు.



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ విజయ, పక్కన పలువురు వైద్యులు

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుగ్గిరాల మండలం చిలువూరు స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 45–50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు కింద పడి గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని పోలీసులు తెలిపారు. మృతుడు తెల్ల బనియన్, నల్ల లుంగీ ధరించి ఉన్నాడు.

గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో కేఎల్‌యూ విద్యార్థుల విజయబావుట

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు గ్రూప్–2 ప్రిలిమ్స్ ఫలితాల్లో విజయ బావుటా ఎగురవేసినట్లు గురువారం వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో బీఏ (ఐఏఎస్) కోర్సులో చదివిన జనరల్ నాలెడ్జ్, సిళాట్‌లు తమ విద్యార్థుల విజయానికి ఎంతగానో దోహదం చేశాయన్నారు. బీఏ (ఐఏఎస్) విభాగాధిపతి డాక్టర్ బి.శివనాగయ్య ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసిన సుమారు 60 తరగతుల కరెంట్ అఫైర్స్ విజ్ఞానం వారి విజయానికి దోహదపడిందని, విద్యార్థులందరికీ ప్రతిరోజు ఇంగ్లిష్ పేపర్ ఇచ్చి విశ్లేషణ చేయించడం, ప్రతి విద్యార్థిని ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలను ఉచితం అందించడం, 365 రోజులు లైబ్రరీ అందుబాటులో ఉండడంతో ఈ విజయం సాధించినట్లు వీసీ డాక్టర్ జి.పార్థసారథి ఆ ప్రకటనలో తెలిపారు.

తనిఖీల్లో రూ.1.08లక్షలు స్వాధీనం

గుంటూరుఈస్ట్: సరైన పత్రాలు లేకుండా ఓ వ్యక్తి నగదు తీసుకువెళ్తుండగా కొత్తపేట పోలీసులు నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట కుగ్లర్ హాస్పటల్ సమీపంలో గురువారం ఫ్లెయింగ్ స్క్వాడ్ కె.జితేంద్ర అనే వ్యక్తిని తనిఖీ చేశారు. అతని వద్ద ఎటువంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.1,08,800లు ఉన్నాయి. పోలీసులు నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బాలికను పెళ్లి చేసుకుంటానన్ని మోసం చేసిన యువకుడిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన పి.సాయికిరణ్‌రెడ్డి మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి కొద్ది రోజుల క్రితం తన వెంట తీసుకువెళ్లాడు. బాలికను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. చివరకు పెళ్ళికి నిరాకరించాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



తెనాలిఅర్బన్: మైకా మినిస్ట్రీస్ చైర్మన్ పాముల రవికుమారి జన్మదినం పురస్కరించుకుని కొల్లిపర మండలం సిరిపురంలోని అబాడెంట్ లెప్రసీ హాస్పిటల్‌లోని కుష్ఠు రోగులకు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాముల జేస్టిస్, పి.రిచార్డ్, అనూష, లెప్రసీ సూపర్‌వైజర్ జంగం శ్యామ్, పి.రజిని, పోతురాజు, నాగరాజు, శ్యామ్‌ప్రసాద్, మాధురి, రూత్ నాగేశ్వరి, సువార్త, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్ర పటానికి నివాళి



పెదకాకాని గ్రంథాలయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళి

- ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి
- నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, పలు సంఘాల నాయకులు

పొన్నూరు: మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని, ఆయన ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ అన్నారు. గురువారం పొన్నూరులో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి అంబేద్కరు సెంటరులోని పూలే విగ్రహానికి అంబటి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. నాయకులు బొద్దులూరి రంగారావు, షేక్.నాజర్, బోయి నాగరాజు, వట్టిప్రోలు రంగారావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ మూర్తి జ్యోతిరావ్ పూలే

కాకుమాను: బడుగు, బలహీన వర్గాల ప్రజల హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గేరా మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి పూలే విశేషంగా కృషి చేశారన్నారు. బాలికా విద్య కోసం అనేక పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విజ్ఞాన కేంద్రం కో–కన్వీనర్ కొత్త వెంకట శివరావు, దొప్పలపూడి రమేష్ బాబు, భువనేశ్వరీ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

పెదకాకాని: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అన్నారు. పెదకాకాని గ్రామంలోని లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన, అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో విశేషంగా కృషి చేశారన్నారు. బాలికల కోసం మొదటి పాఠశాలను పూణేలో ప్రారంభించారని తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

తెనాలిరూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎన్నికల సమయంలో అలజడులు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు హెచ్చరించారు. తెనాలి వన్‌టౌన్ పోలీసులు, సీఐఎస్ఎఫ్ బలగాలు గురువారం సాయంత్రం పట్టణంలోని శివాజీచౌక్, గాంధీచౌక్, బోస్‌రోడ్డు, చినరావూరు తోట, రామలింగేశ్వరపేట, డిపో సెంటర్, నాజరుపేటలో రూట్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా సీఐ అన్నారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు భద్రత మీ వెంటే ఉంటుందన్న నమ్మకం కల్పించేందుకు అన్ని ప్రాంతాల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నటుట్ తెలిపారు.



ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి



దంతలూరు(కొల్లిపర): దంతలూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ మండల టెక్నికల్ అసిస్టెంట్ ఎం.రవి అన్నారు. గురువారం మండలంలోని దంతలూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కూలీకి పనులు ఉన్నాయని అన్నారు. వీటిని 600 మందికి సరిపడా పనులు కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ కనపర్తి సాగర్, గ్రామ ఉపాధి వేతన దారులు పాల్గొన్నారు.